# 16. ప్రణయిని

సముద్రం నిశ్చలంగా, కాంతివంతంగా వుంది. ఒడ్డున హెవేరీ పట్టణ ప్రజలంతా జేరి, సమీపిస్తూన్న ఓడలకై ఎదురు చూస్తున్నారు.

కొద్దిదూరంలో అవన్నీ గుంపులుగా ఉన్నవి. వాటిలో కొన్ని స్టీమర్లు కూడా ఉండటంవల్ల పెద్ద పెద్ద పొగ మేఘాలు పైకి లేస్తున్నవి. మిగతావి ఓడలు కావటంవల్ల, ఒడ్డుకు కనిపించని మోకుల్తో బిగించిన తెరచాప కొయ్యలు మాత్రమే కనిపిస్తున్నవి. తెరచాపల అవసరం ప్రస్తుతం లేకపోవటం వల్ల – ఆ కొయ్యలు దూరానికి ఆకులులేని పొడుగాటి చెట్లను జ్ఞాపకం చేస్తున్నవి.

దూరాన భూమి ఆకాశంతో కలుస్తూన్నట్టు కనిపించే చోటులోని అన్ని వైపులనుంచీ ఓడలూ, స్టీమర్లూ – సముద్రపు సన్నటి పాయ భూమిలోకి చొచ్చుకుపోయిన యీ ఒడ్డువైపు త్వర త్వరగా వొస్తున్నవి. గమ్యస్థానాన్ని జేరేప్పుడు కలిగే తమ సంతోషాన్ని ప్రకటించేందుకుగాను అవి మూలుగుతూ, ఎక్కువపొగనూ, ఆవిరినీ వొదుల్తూ, కూతలు వేస్తూ వొస్తున్నవి.

ప్రజలు జేరిన యీ ఒడ్డున – ఇద్దరు యువకులైన ఆఫీసర్లు నడుస్తున్నారు. నమస్కారబాణాల్ని వొదుల్తూ, మరి కొన్నిటిని తీసుకుంటూ మధ్య మధ్య తమలో తాము ఏదో మాట్లాడుకునేందుకు ఆగుతూ ఉత్సాహంగా నడుస్తున్నారు.

ఆకస్మాత్తుగా వారిద్దరిలోనూ పొడుగాటివాడైన హెన్రీ – తన స్నేహితుడైన జీన్ చేతిని హెచ్చరికగా నొక్కుతూ, రహస్యంగా “అదుగో మాడమ్ ఎలీజా – కాస్త ఆమె వైపు తిరుగు. ఆమె నీవైపు ప్రేమపూర్వకంగా చూస్తోందని నాకు గట్టినమ్మకం” అన్నాడు.

ఆమె భర్త చేతిని ఊతగా తీసుకొని నడుస్తూ వుంది. ఆమె వయస్సు నలభై సంవత్సరాలైనా సౌందర్యవతి. కొద్ది లావుపాటి మనిషి కావటంవల్ల వ్యక్తిత్వంలోని నిండుతనమేమీ తగ్గలేదు. ఆమె ఇరవై సంవత్సరాల వయస్సులో ఎలా ఉండేదో, ఇప్పుడూ అలాగే ఉన్నట్టు తోస్తుంది. ఆమె పెద్దనల్లని కళ్ళవల్లా, నడకలోని ఠీవివల్లా, అభిమానంతో కూడిన ప్రవర్తనవల్లా – ఆమె స్నేహితులందరూ ఆమెను ఒక దేవతలాగు చూస్తూంటారు. ఒకరిచేత ఒక్కమాట కూడా అనిపించుకొని ఎరుగదు. ఆమె ప్రవర్తన కనీసం అనుమానించినట్టు కూడా ఎవ్వరూ, ఎప్పుడూ చాటుగాకూడా సూచించుకొని ఉండరు. దుష్ట వర్తన అంటే ఏమిటో ఎరుగని అతి పవిత్రమైన వ్యక్తిగా ప్రజలామెను చెప్పుకుంటూండటంవల్ల – ఆమెను గూర్చిన చెడ్డ ఆలోచనలు చేసేందుక్కూడా ఏ పురుషుడికీ ధైర్యం ఉండేదికాదు.

ఏమైనా గత నెలరోజుల్నుంచీ ఆమె తన స్నేహితుడైన జీన్ మీద కన్నువేసి ఉంచిందనీ, అందుకేమీ సందేహం లేదనీ హెన్రీ మాటిమాటికీ జీన్‌కు జ్ఞాపకం చేస్తూనే వున్నాడు.

"ఒక్క విషయం మాత్రం రూఢిగా తెలుసుకో. నన్ను నేనుమాత్రం మోసం చేసుకోను. నాకు స్పష్టంగా కనిపిస్తూనే వుంది. ఆమె నిన్ను గాఢంగా ప్రేమిస్తోంది. ఇంతకు పూర్వం అసలు ప్రేమ అంటే ఏమిటో తెలుసుకోలేకుండా, అతి పవిత్రంగా జీవితాన్ని గడిపే స్త్రీ ఒక్కసారిగా ప్రేమ అగాధాల్లో పడ్డంత తీవ్రంగా ఆమె ప్రేమిస్తోంది. యీ ప్రేమ మైకాన్ని తెలుసుకునేందుకు నలభై ఏళ్ళు పట్టిందంటే – ఆ తీవ్రత ఎంతగా వుంటుందో ఆలోచించు. ఆ ఉద్రేకం అతి ప్రమాదకరమైనది. మూర్ఖంగా ఎంతటి తప్పులైనా తేలిగ్గా చేసెయ్య గలదిగా ఉంటుంది .... దెబ్బతిన్న పక్షి నేల కొరిగినట్టుగా ఆమె నీ బాహువుల్లో పడిపొయ్యేందుకు సిద్ధంగా ఉన్నదంటే నమ్ము. అందాకా ఎందుకూ – ఒక్కసారి ఆమె వైపు చూడు..." యీ విధంగా హెన్రీ చెప్తూండేవాడు.

ఆమె ఇద్దరు కూతుళ్ళూ పదిహేనేళ్ళూ, పన్నెండేళ్ళ వాళ్ళు ముందు నడుస్తూంటే వెనుక ఆమెవొచ్చేది. జీన్‌ను సమీపించగానే ఆమె ముఖం పాలిపొయ్యేది. ఆమె కళ్ళు మాత్రం జీన్ వైపు చూస్తూ మెరుపులాగు వెలిగిపొయ్యేవి. ముందున్న కూతుళ్ళనుకానీ, ప్రక్కనున్న భర్తనుకానీ – ఇతర ప్రజలను కానీ లెక్కచెయ్యకుండా ఆమె తన చూపులన్నిటినీ జీన్‌మీద కేంద్రీకరించేది, నిర్భయమై – మెరిసిపోతూండే ఆ చూపు అర్థం అతి తేలిగ్గా అర్థమౌతుంది. ఆ స్నేహితులిద్దరూ ఆమెకు గుడ్ మార్నింగ్ పెట్టినప్పుడు కూడా, ఆమె చూపులను మార్చకుండానే వారికి ప్రతిగా నమస్కరించేది. యీ విధంగా జరుగుతూండటంవల్ల చివరకు ఆమె తనను ప్రేమిస్తోందనే విషయాన్ని అనుమానించక తప్పలేదు.

పక్కనున్న స్నేహితుడు గొంతు బాగా తగ్గించి "నాకు చాలా రూఢిగా తెలుసు. యీసారన్నా నువ్వామెను పరీక్షగా చూశావుగా! ఆమె ఎంత అందమైనది! నిన్నే ప్రేమిస్తోంది-" అని మళ్ళీ హెచ్చరించాడు.

## 2

కాని జీన్ దృష్టి కులకాంతలవైపు మళ్ళటంలేదు. ప్రేమ విషయం అవతలుంచి - ఒక యువకుడు అప్పుడప్పుడు పొందగలిగే సౌఖ్యాన్ని రుచి చూస్తూనే ఉండేవాడు. ఆమె కేంద్రీకరించిన దృష్టీ, సంస్కారంగల ఆమె మృదుత్వమూ, సాంఘికంగా ఆమె అత్యున్నతస్థానము - మొదలైనవాటితో అతని తల వాచింది. అతను నిర్మించుకున్న అనిశ్చితాభిప్రాయం తాలూకు పటుత్వం సడలింది. చివరకు అన్నాడు : "ఒక్క నెలరోజులలో నేను కోరేదానికన్న ఎక్కువే లభిస్తుంది. ఇక మర్యాదకోసం కనీసం ఆరు నెలలైనా వేచి కూర్చోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది."

తరువాత ఊరంతా గోలవటమూ, తనకూ ఆమెకూ మధ్య ఏర్పడే యీ కొత్త బాంధవ్యంవల్ల ఆమె మరీ నిరాధారురాలుగా తనను పట్టుకొని వేళ్ళాడటమూ, ఊరి పెద్దలందరూ తనను మందలించటమూ - మొదలైన అనేక విషయాల్ని అతను ముందుగానే ఊహించుకోగలిగాడు.

అందుకనే ఎలీజాను ఎంతగానో తప్పించుకుంటూ తిరగసాగాడు.

కాని ఒకనాటి సాయింత్రం ఒక డిన్నర్ పార్టీలో - తన పక్కనే ఆమె కూర్చొని ఉన్నదన్న సంగతిని హఠాత్తుగా కనిపెట్టాడు. అతని రోమరోమమూ ఒణికింది. అతని కళ్ళు భయంతో టపటప లాడినయ్. ఆమె చూసే వాడి చూపులకు అతని హృదయంలోని జ్వాల పెద్దదై పొడుగాటి నాలుకలు జాచింది. వారి చేతులు తమ ప్రయత్నమేమీ లేకుండానే కలుసుకున్నయ్; ఆ వెచ్చని కరస్పర్శను వారు చాలాసేపు అనుభవించారు. ఇది వారి ప్రేమ కలాపాలకు నాంది...

తనకు ఇష్టం లేకపోయినా అతను అప్పుడప్పుడు ఆమెను చూస్తూనే ఉన్నాడు. తను ప్రేమించబడుతున్నాడనే సంగతి అతనికి రూఢిగా తేలిపోయింది. ఆమె హృదయం తనకు అర్పించబడ్డదనే విషయాన్ని గ్రహించగానే - ఆమె మీద అతని కొకరకం జాలి కలిగింది. ఆమె మనస్సు కష్టపడకుండేట్టుగా - తనకు ఆమెమీద ఇష్టం ఉన్నట్టే నటిస్తూ - దూరంగా ఉండే ఆమె చేత ప్రేమించబడి, పూజింపబడుతూండేవాడు. దీనివల్ల తనకు నష్టం లేకపోవటమే కాక ఆమె ఒక రకం తృప్తిలోని ఆనందాన్ని అనుభవించ గలుగుతుందనీ, ఇది మానసిక ప్రణయమే కనుక అంతగా పట్టించు కోనక్కర్లేదనీ అతను తలిచాడు.

ఒంటరిగా కలుసుకొని, స్వేచ్ఛగా మాట్లాడేందుకని ఆమె ఒకనాడు అతన్ని ఆహ్వానించింది. యీ ప్రేమ ప్రవాహంలో పడ్డాక, ఆమె తలపులు ఇంకే పనిమీదికీ పోవటం లేదు. ఆ కోర్కెల కన్నీటికీ ఆమె వెంటనే లొంగిపోయింది. తన శరీరాన్నీ, తన ఆత్మనూ, గౌరవమర్యాదల్నీ, తన ఉన్నత స్థానాన్నీ, చివరకు తన సౌఖ్యాన్ని కూడా ఆమె త్యాగం చేసింది; తన హృదయంలోని ప్రణయజ్వాలకు వాటన్నిటినీ ఆహుతిగా సమర్పించేందుకు ఆమె వెనకా ముందూ ఆలోచించనే లేదు.

కొద్దికాలం జరిగేప్పటికల్లా – అతనికి యీ జీవితం మీద విసుగెత్తింది. ఆమె ప్రేమతో నిజంగానే అతని తలవాచిపోయింది. కాని అతను యీ ప్రణయ ప్రాంగణంలో ఒక ఖైదీగా ఉండిపోవలసి వొచ్చింది.

ఆమె ఇలా అంటూండేది. "నా సర్వస్వాన్నీ నీకు అర్పించాను. నీకింకా ఏం కావాలో చెప్పు–"

అతను ఇలా జవాబు చెప్దామనుకునేవాడు:

"నేను నీనుంచేమీ కోరలేదు. నువ్వు నాకు సమర్పించిన దంతా వెంటనే తీసుకుపొమ్మని ప్రార్థిస్తున్నాను–" కాని ఆ మాటల్ని ఉచ్చరించే ధైర్యం అతనిలో లేకపొయ్యేది.

ఎవరైనా చూసిపోతారనే విషయాన్ని గూర్చి లెక్క చెయ్యకుండా, సర్వ నాశనానికీ సిద్ధమైనదానివలె – మొండిగుండెతో అతన్ని కలుసుకునేందుకు ప్రతి సాయింత్రమూ వొస్తూండేది. రోజు రోజుకూ ఆమె ప్రణయజ్వాలలు ప్రళయ రూపానికి దగ్గరిగా జరుగుతూండేవి. అతని బాహువుల్లో వాలిపొయ్యేది. ఉద్రేకంతో కూడిన ఏనుగు బలంతో అతన్ని కౌగలించుకునేది. ముద్దుల వర్షాన్ని ఏకధాటిగా కురిపించటం వల్ల అలసిపోయి – అతని కాళ్ళదగ్గర సొమ్మసిల్లి పడేది. యీ ప్రవర్తనతో అతనికి విసుగెత్తి పోయింది. అతని ఓర్పంతా మాయమవసాగింది.

"ఇదుగో చూడు – నువ్వు విపరీతమైన యీ ఉద్రేకాన్ని తగ్గించుకోవాలి –" అన్నాడు గొణిగే ధోరణిలో.

ఆమె "నేను నిన్ను గాఢంగా ప్రేమిస్తున్నాను" అని జవాబు చెప్పి, అతనిముందు మోకరించి, అతి ప్రియమైన వస్తువును చూసేవిధంగా చాలాసేపటివరకూ అతనివైపే చూస్తూ ఉండిపోయింది. భక్తితో చూసే ఆ చూపును కూడా భరించలేక అతను ఆమెను లేవదీస్తూ "సరే...ఇట్లా కూర్చో...మాట్లాడుకుందాం" అన్నాడు.

"వొద్దు....నన్ను వొదిలిపెట్టు" అని గొణిగి, పూర్వం వలెనే మోకరించి, ఆత్మతో సహా తన్మయత్వంలో లీనమైపోయింది.

యీ విషయాన్నే హెన్రీతో చెప్తూ జీన్ అన్నాడు. "ఆమెను వొదిలించుకునే మార్గం నాకేమీ కనిపించటం లేదు. చివరకు ఆమెను చావబాదేదాకా వెళ్ళాల్సి వొచ్చేట్టుంది. ఇంకా ఆలస్యం చెయ్యటం మరీ ప్రమాదాలకు దారి తీస్తుందని కూడా తోస్తోంది...నీ సలహా ఏమిటీ?"

హెన్రీ జవాబు చెప్పాడు. "నువ్వు అంతగా భరించలేకపోతే యీ సంబంధాన్ని తెంచుకొని బైటపడే మార్గం చూడు."

జీన్ అన్నాడు "నీకేమీ పట్టనట్టుగా మాట్లాడవోక. జీవితంలో తన ఆశలన్నిటినీ నామీదనే కేంద్రీకరించుకొని, భరించలేనంత దయారసంతో నన్ను ముంచివేస్తూ, తన ప్రేమతో బాధిస్తూ, ఏవిధంగానైనా నన్ను ఆనందింప చెయ్యటమే గురిగా పెట్టుకున్న స్త్రీని వొదిలించుకోవటం మాటలా? నేను కోరకపోయినా ఆమె తన సర్వస్వాన్నీ నాకు అర్పించటమేగా ఆమె తప్పు? ఆమెను విడనాడగలగటం అతి తేలికని మాత్రం నమ్మవొద్దు- తెలిసిందా?"

ఒకనాటి ఉదయానికల్లా ఆ సైన్యభాగం అక్కణ్నుంచి వెళ్ళబోతోందనే వార్త అంతటా వ్యాపించింది. ఈ వార్త విన్నప్పుడే జీన్‌కు ఆనందంతో నాట్యం చెయ్యాలనిపించింది. చివరకు అతను రక్షించబడ్డాడు. ఏడ్పులూ, పెడబొబ్బలూ, బాధలూ, దుర్ఘటనలూ - ఇవ్వేమీ లేకుండానే దూసుకో గలడు! అతనికి కష్టమల్లా ఇంకొక్క రెండు నెలలపాటు ఓర్చుకోవటమే!

ముఖంలోని ఉద్రేకాన్ని అనేక రెట్లుగా పెంచుకొని ఆ సాయింత్రం ఆమె వొచ్చింది. ఈ దుర్వార్త వినగానే ఆమె విపరీతంగా బాధతో చలించిపోయింది. వొచ్చీ రావటంతోనే - టోపీకూడా తియ్యకుండా, నదిలోపడి యీదుతూ క్రమంగా బలహీనమైపోయిన మనిషి, పక్కవాడి చేతుల్ని సహాయంకోసం గట్టిగా పట్టుకున్నట్టు అతన్ని గట్టిగా వొత్తుతూ, భయంతో కూడిన చూపులన్నిటినీ అతని మూర్తిమీద కేంద్రీకరించి, ఉద్రేకంతో ఒణికే కంఠస్వరంతో ఆమె ఇలా అంది :

"నన్ను విడిచి వెళ్ళిపోబోతున్నావని నాకు తెలుసు. అప్పుడే నా విధిని నేను నిర్ణయించుకో గలిగాను. ఆ పని చేసేందుకు నేనింకేమీ ఆలోచించి అనవసర కాలయాపన చెయ్యక్కర్లేదు. స్త్రీ తన ప్రేమను నిరూపించేందుకుగాను చెయ్యగలిగిన మహత్కార్యాన్ని చెయ్యటానికి నిశ్చయించుకున్నాను. నేను నీతోనే వొస్తాను. నా సంతానాన్నీ, భర్తనూ, ఆస్తిపాస్తుల్నీ, గౌరవ మర్యాదల్నీ - నా సర్వస్వాన్నీ నీకోసం త్యాగం చేసేస్తాను. నేను సర్వనాశనం అవుతూన్నా నీవు ఆనందంగా వుంటే చాలు. నేను ఇంకో జన్మ ఎత్తి నీకు అర్పించుకుంటున్నానంత సంతోషంగా వుంది. నేను చేయగలిగిన గొప్ప త్యాగాల్లోకల్లా చిట్టచివరిది ఇదే...ఎప్పటికీ కూడా నేను నీదాన్నే!"

అతనిలోని ఉష్ణ రక్తమంతా గడ్డకట్టుకు పోయినట్టయింది. అతనిలోని బలహీనత్వంవల్ల రేకెత్తిన కోపానికి కంఠస్వరం మూగవోయింది. ఏమైనా అతను ఎలాగో తట్టుకోగలిగాడు. శాంతంగా ఉండగలిగాడు. ఒక రకం దయను కనబరుస్తూ, తనకు ఇష్టం లేనట్టు సూచించే కంఠ స్వరంతో అతను ఆమె త్యాగాన్ని అంగీకరించటంలేదని చెప్పాడు. ఎన్నో కారణాల్ని చెప్పి ఆమెకు నచ్చ చెప్పేందుకు ప్రయత్నించాడు. విషయాల్ని జాగర్తగా పరిశీలించమనీ, తన కుటుంబసౌఖ్యాన్నీ, గౌరవమర్యాదల్నీ విడనాడవొద్దనీ, తన సంతానం సంగతి ఇంకోసారి ఆలోచించమనీ– ఇలాటివే ఇంకా ఎన్నో కారణాలు చెప్పాడు. పెద్ద నల్లటి కళ్ళతో చూస్తూ, అతను చెప్పినంతసేపూ వింటూ ఊరుకుంది. ఆమె తన మాటలకు లొంగుతోందని తలచి, అతను మరికొన్ని కారణాల్ని మెల్లిగా, జాగ్రత్తగా, ఎదుటి మనిషి మనసును కదిలించే విధానంలో చెప్పసాగాడు.

అంతా విన్నాక ఆమె అంది: “నువ్వింత పిరికి వాడుగా ఉండిపోతావా? స్త్రీని అనుభవించి, పరిస్థితులు కొద్దిగా తారుమారైన కారణం వల్ల ఆమెను విడనాడి వెళ్ళిపొయ్యే నీచాభిప్రాయాల్తోనే ఉండి పోతావా?”

యీ మాటలకు అతను పాలిపొయ్యాడు. చెప్పిన కారణాల్నే తిరిగి చెప్పటం మొదలుపెట్టాడు. యీ పనివల్ల తమకు మళ్ళీ సరిదిద్దుకునే అవకాశం లేని సంఘటనలు సంభవించటమూ, అవి జీవితాంతం వరకూ తమను వెంటాడుతూనే ఉండటమూ, తమ జీవితాలు తునాతునకలై పోవటమూ, లోకం తామిద్దర్నీ పూర్తిగా బహిష్కరించటమూ మొదలైన విషయాలన్నింటినీ ఇంకోసారి జ్ఞాపకం చేశాడు.

“మనిద్దరిమధ్యా ప్రణయబంధన ఉండగా – యీ లోకానికీ, యీ సంఘానికీ భయపడేదేమిటి?” అని ఆమె జవాబు చెప్పింది.

అతను కోపంతో ఉడికిపొయ్యాడు.

అన్నాడు : “అట్లా అయేట్టయితే నేను మాత్రం యీ పనికి ఒప్పుకోను. అంతేకాకుండా నువ్వీపని చేసేందుకూడా నేను అంగీకరించను.”

చాలా రోజుల్నుంచీ అతని హృదయంలో కుళ్ళుతూ, వెలికి ఉరికే ధైర్యంలేక అక్కడే ఉండిపోయిన ద్వేషాగ్ని యీ సమయంలో అతివేగంతో బైటపడి అతనికి సహాయపడ్డది.

“నేను కోరకపోయినా – నువ్వు నన్ను పట్టుకొని వేళ్లాడుతున్నావు. చాలా కాలంగా నేను దీన్ని భరిస్తున్నాను. కాని శృతిమించి రాగాన పడ్డావు. ఇప్పుడు చేయదగిన పని ఒక్కటే – నిన్ను గూర్చి నువ్వు జాగ్రత్త తీసుకో. నా గౌరవ మర్యాదల్ని కాపాడు. ఆ పనికి నేను ఎంతయినా కృతజ్ఞుణ్నిగా ఉంటాను–” అన్నాడు.

ఆమె పెదవులైతే కదల్చలేదు కాని ఆమె ముఖం మాత్రం మాడిపోయింది. శరీరంలోని కండరాలు, రూపాన్ని కోల్పోయినప్పుడు కలిగే బాధలాటిది ఆమె ముఖంలో స్పష్టంగా కనిపించింది...ఆమె 'గుడ్‌బై' చెప్పకుండా మెల్లిగా వెళ్ళిపోయింది.

ఆ రాత్రే ఆమె విషం మింగింది.

ఒక వారందాకా ఆమె బతికే ఆశలు ఎవరికీ లేవు. యీ సంఘటనను గూర్చి పట్నంలోని ప్రజలందరూ గుసగుసలాడ సాగారు. ఆమె చేసినపనిని ఎవరూ చెడుగా విమర్శించలేకపొయ్యారు. అణుచుకోలేని ఆ ఉద్రేకానికి లొంగిపోయి ఆమె తప్పునే చేసి ఉండవచ్చుననీ, యీ రకం తప్పులు అతి సామాన్యమైనవి కనుక - అందరూ ఆమెను జాలిగా, దయగా మాట్లాడసాగారు. ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించటం - ఆ పరిస్థితుల్లో ఆడదాని ప్రేమను ద్విగుణీకృతం చేసి లోకానికి చూపటమే కనుక, ఆమెను అందరూ హర్షించారు. యీ తప్పులూ, ఆమె ప్రాణానికే ఎసరుపడ్డ యీ వాతావరణమూ - ఇవన్నీ లెఫ్టినెంట్ జీన్‌మీద పడ్డవి. ప్రతివారూ అతని కాఠిన్యాన్నీ, అతను ఆమెకు చేసిన అన్యాయాన్నీ గూర్చి విమర్శించసాగారు.

జీన్ ఆమెను విడనాడాడనీ, ఆమెను పరాభవించాడనీ, ఆమెను మోసపుచ్చి ద్రోహంచేశాడనీ ఊరంతా కమ్ముకుపోయింది. ఇదేరకం జాలి - కలొనెల్‌కు కూడా కలిగింది. ఏదో విధంగా యీ పరిస్థితిని చక్కబెట్టక పోవటంవల్ల ముందు ముందు ఇంకా ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంటుందనే దృఢనిశ్చయంతో జీన్‌ను పిలిపించాడు.

హెన్రీ జీన్‌ను పిలుచుకొని వొచ్చేందుకు వెళ్ళినప్పుడు ఇలా అన్నాడు: "వెధవపని చేశావురా - ప్రేమ మైకంలో ఉండిపోయిన ఒక స్త్రీని ఆత్మహత్యకు పురిగొల్పే పరిస్థితుల్ని కల్పించటంకన్న ఘోరం ఇంకోటిలేదు. అంతకన్నా సిగ్గుపడాల్సిన విషయం ఉండబోదు."

జీన్‌కు కోపంవచ్చి "నీకేమీ తెలియదు...నోరు మూసుకో" అన్నాడు.

"నువ్వొక నీచుడివి" అన్నాడు హెన్రీ.

ఇక మాటలు దాటటం వల్ల చేతులు కలిసినవి. ద్వంద్వ యుద్ధం జరిగింది. జీన్ బాగా గాయపడ్డాడు. యీ విషయం అందరికీ తృప్తిగా తోచింది.

యీ సంగతి ఆమె విన్నది, ఆమె ప్రేమ ఇంకోమెట్టు పైకి పాకింది. తన కోసమే యీ ద్వంద్వయుద్ధం జరిగి ఉంటుందనే ఆమె నమ్మకమే ఆమె ప్రణయానికి దోహద మయింది...ఆమె చాలా నీరసంగా ఉండటంవల్ల సైన్యభాగం అక్కణ్నుంచి వెళ్లేముందు - జీన్‌ను ఒక్కసారి కూడా చూసే అవకాశం కలగలేదు.

## 3

లిల్లీ పట్టణంలో అతను మూడునెలలు ఉన్నాడు. ఒకనాటి ఉదయం - ఎలీజా చెల్లెలు అతనికోసం వొచ్చింది.

చాలాకాలంగా బాధపడి కొద్దిగా ఆరోగ్యాన్ని పుంజుకున్నాక - ఆమె తన ప్రేమను జీన్ వైపునుంచి తిప్పుకోలేక, ఆ ఉద్రేకాన్నంతటినీ ఎలాగో భరిస్తూ కుంగి కృశించిపోయిందనీ, ప్రస్తుతం బతికే సూచనలేమీ లేవనీ, శాశ్వత నిద్రకు పోబొయ్యేముందు ఒక్కసారి జీన్‌ను చూడగోరుతోందనీ - ఆమె చెప్పింది.

ఎలీజామీద కలిగిన కోపమూ, అసహ్యమూ కాలక్రమాన జీన్‌లో తగ్గిపోయినవి. యీ సంగతి వినగానే అతని హృదయం కరిగిపోయింది. కళ్ళు రెండూ నీళ్ళతో నిండినవి. క్షణం కూడా ఆలస్యం చెయ్యకుండా హెవేరీ పట్టణానికి బయలుదేరాడు.

ఆమె తుది క్షణాల్లో ఉన్నట్టు కనిపిస్తూనే వుంది. వారిద్దరూ ఒంటరిగా విడవబడ్డారు. ఒకప్పుడు ఆమె ఆత్మహత్య చేసుకునేందుకు తనే కారణమని నమ్మి జీన్ తనను తాను నిందించుకున్నాడు. నిజానికి తన తప్పేమీ లేకపోయినా, అతని హృదయమంతా యీ క్షణాన విచారంతో నిండిపోయింది. యీ క్షణంలో ఆమె అంత్యదశలో ఉన్నదని నమ్మటంవల్ల అతని ప్రణయమూ, బాధా, దయా, జాలీ - ఇవన్నీ ఒక్కసారిగా అతనిలో పనిచేయసాగినయ్.

చిన్న పిల్లవాడిలాగు వెక్కి వెక్కి ఏడుస్తూ, సున్నితంగా ఆమెను తన చేతుల్లోకి తీసుకొని, తేలిగ్గా ప్రేమగా ముద్దు పెట్టుకున్నాడు. యీ రకం ప్రేమను అతను జీవితంలో ఇంతకు ముందెప్పుడూ ప్రకటించి ఉండలేదు.

దుఃఖంవల్ల పూడుకుపోయిన గొంతుతో అతను గొణిగాడు: "...నీకేమీ ఫరవాలేదు. మృత్యువుకు భయపడవొద్దు, క్రమంగా ఆరోగ్యం కలుగుతుంది. అప్పుడు మనమిద్దరమూ జీవితాంతంవరకూ ప్రేమించుకోవచ్చు- జీవితాంతం వరకూ!"

బలహీనంగా నవ్వుతూ ఆమె అంది : "ఇదంతా నిజమేనా? నువ్వు నన్ను హృదయపూర్వకంగా ప్రేమిస్తున్నావన్నమాట?"

ఆమె దురదృష్టతకు జాలిగా అతను ఆ సమయంలో ఎన్నో వాగ్దానాలు చేశాడు. ఆమె ఆరోగ్యవంతురాలయ్యాక తన ప్రేమను నిరూపించి తీరుతానని నమ్మకం కలిగించాడు. ప్రేమవల్ల కలిగే జాలితో - ఆమెను అనేకసార్లు ముద్దుపెట్టుకున్నాడు. ఉష్ణతాపంవల్ల ఎగిరెగిరిపడే ఆమె హృదయానికి ఎంతో ఆనందాన్ని చేకూర్చాడు.

మరునాడు అతను తిరిగి వొచ్చేశాడు...ఆమెకు మాత్రం యీ ప్రణయం దివ్యౌషధంగా పనిచేసింది.

ఆరువారాలు గడిచాక - ఆమె జీన్‌ను కలుసుకునేందుకు వొచ్చింది. పూర్వంవలె అమిత ఉత్సాహంతో వుంది. అసలు మార్పేమీ జరిగినట్టే లేదు. పూర్వంకన్నా అందంగా ఉన్నదనటం కూడా అతిశయోక్తి కాదు.

జీన్ మనస్సులో కలిగిన మార్పులవల్ల ఆమెతో కలిసి వేరే కాపరం చేసేందుకు యీసారి అతను ఒప్పుకున్నాడు. వివాహ బంధనం వున్న భార్యభర్తల వలె వారిద్దరూ జీవించసాగారు. పూర్వం ఆమెను విడనాడినందుకు తనను మందలించిన కలొనెల్ ఇప్పుడు యీ చర్యను ఖండించసాగాడు. వివాహం కాకుండా యీవిధంగా కలిసి ఉండటం సంఘవిరుద్ధమనీ, ఇలాటి అవినీతికరమైన పనివల్ల సైన్యంలోని శిక్షణ వక్రమార్గాల పడుతుందనీ, ఇతర ఆఫీసర్లందరూ కూడా రేపటినుంచీ ఇలాటి విధానాన్నే అనుసరిస్తారనీ - కనుక వెంటనే ఆమెను పంపేసి మామూలుగా ఉండవలసిందనీ జీన్‌ను నిర్బంధించాడు....కాని జీన్ దానికి ఒప్పుకోలేదు. ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేసి బైటపడ్డాడు.

పాశ్చాత్య కవులందరూ కలలుకనే మెడిటరేనియన్ సముద్రపు ఒడ్డునవున్న చిన్న గ్రామానికి వెళ్ళి జీన్ ఆమెతో కలిసి ఉండేందుకు నిశ్చయించుకున్నాడు.

అక్కడ మూడు సంవత్సరాలు సుఖంగా గడిచిపోయినయ్. నిశ్చలమైన ఆమె ప్రేమభారానికి అతను క్రమంగా అలవాటైపొయ్యాడు. ఇప్పటికే అతని తల నెరిసింది.

జీవితంలో తను విధిగా చేయవలసిన పనిని చేసిన గర్వం అతనిలో వుంది. తన జన్మ సార్థకమైనట్టుగానే అతను సంతోషంగా ఉండేవాడు. తను ఊహించ గలిగినదానికన్న ఎన్నో రెట్ల సౌఖ్యాన్ని అనుభవించి ఉండటంవల్ల - జీవితంలో అతనికి మరి ఆశలేమీ ఉండే అవకాశం లేకపోయింది. జీవితంలో అనుభవించేందుకు సౌఖ్యమేమీ లేనట్టే తృప్తి పడేందుకు మరొక సంఘటనేమీ కనిపించనట్టే ఉండేది. నిండుకుండలాటి అతని హృదయంలోకి ఇంకే విషయమూ చొచ్చుకునే అవకాశమే లేదు.

ఒకనాటి ఉదయం ఒక విజిటింగ్ కార్డు అతనికి అందివ్వబడ్డది. అందులో 'జోసఫ్ ప్రికాట్ - ఓడలవ్యాపారి - హెవేరీ' అని వుంది.

జోసఫ్ ఆమె భర్త అని గ్రహించేందుకు అతనికి ఎక్కువసేపు పట్టలేదు. ఆడది తెగించి, అంతనూ త్యాగంచేసి బయలుదేరినప్పుడు ఆమెను ఆటంకపరచటంవల్ల లాభం లేదనీ, అసలు ఆటంకం చెప్పటం మౌఢ్యమనీ - యేమీ మాట్లాడకుండా ఊరుకున్న ఆమె భర్త...ఆయన తననుంచి కోరేదేమిటి?

ఆ ఇంట్లోకి వొచ్చేందుకు నిరాకరించి జోసఫ్ తోటలోనే ఉండిపొయ్యాడు. జీన్ సమీపించగానే వినయపూర్వకంగా తల వొంచాడు. పక్కనున్న సిమెంటు బెంచీమీద

కూడా కూర్చునేందుకు నిరాకరించి, నెమ్మదిగా, జాలిగొలిపే కంఠంతో ప్రతిమాటా స్పష్టంగా వినపడేట్టు ఇలా అన్నాడు :

"మాన్సియర్! మిమ్ము నిందించేందుకు నేనిక్కడికి రాలేదు. పరిస్థితులు ఏవిధంగా జరిగినయ్యో నాకంతా తెలుసు. సంఘటనలకు నేను - కాదు - మనందరమూ - దయామయుడైన ఆ విధికి ఎరలుగా తయారయ్యాం. ఆ పరిస్థితులు అలాగే ఉండిపోయినట్టయితే - శాంతియుతమైన మీ జీవనం జోలికే వొచ్చేవాణ్ని కాదు. మాన్సియర్! నాకు ఇద్దరు కుమార్తెలున్నారు. అందులో పెద్దామె - ఒక యువకుణ్ని ప్రేమిస్తోంది. అతనిచేత ప్రేమించబడుతూ వుంది. కాని - పెళ్ళికుమార్తె తల్లిప్రవర్తనను ఆధారంగా తీసుకొని - పెళ్ళికుమారుడి బంధువర్గం యీ పెళ్ళికి ఆటంకాలు చెప్తూ వుంది. ఆమెమీద నాలో ద్వేషంకానీ, అసహ్యం కానీ లేవు. కాని నా కుమార్తెలను నేను ప్రేమిస్తున్నాను. అందుకని నా భార్యను ఇంటికిరమ్మని అడిగేందుకుగాను ఇప్పుడు నేనిక్కడికి వొచ్చాను. యీనాడు ఆమె నా ఇంటికి - తన యింటికి - తిరిగి వొస్తుందనే ఆశ నాకు వుంది. ఇక నా విషయం - లోగడ జరిగిందంతా మరిచిపోయినట్టుగా ప్రవర్తిస్తాను..ఇదంతా నా కూతురు సౌఖ్యంకోసం!"

గొప్ప తప్పుచేసి, అంతరాత్మ క్షోభతో బాధపడేవాడు, క్షమను పొందగలిగినప్పుడు పొందేలాటి ఆనందంతో జీన్ హృదయం నిండిపోయింది.

జీన్ అన్నాడు : "దానికేం?....తప్పకుండా తీసుకువెళ్ళండి...నేనుకూడా మీకు యీవిషయంలో సహాయం చేస్తాను...మీరేమీ అనుమానించక్కర్లేదు... మీరు చేసే పని న్యాయం...న్యాయసమ్మతమైంది!"

యీ మాటలు విన్నాక జోసఫ్ కూర్చునేందుకు మరి నిరాకరించలేదు.

జీన్ అతివేగంగా మేడమెట్లు ఎక్కాడు. ఆయాసంతో ఆమె గది వాకిలి ముందు ఆగిపొయ్యాడు. తను మాట్లాడాల్సిన విధానాన్నీ, ఆమెను ఒప్పించే విషయాల్నీ జ్ఞాపకం చేసుకున్నాడు... ఒక విధంగా విచారకరమైన ముఖభంగిమతో ఆమె గదిలోకి ప్రవేశించాడు.

జీన్ అన్నాడు : "నీకోసం ఎవరో వొచ్చి కింద ఉన్నారు. నీ కుమార్తెలను గూర్చి నీతో చెప్పేందుకు వొచ్చారు."

ఆమె లేచి నిలబడి "నా కుమార్తెలా? ఏం? ఏమైంది? వారు మరణించారా?" అంది.

"లేదు...కాని ఒక దుర్ఘటన వాటిల్లింది. దాన్ని నువ్వొక్కతెవే సరి చెయ్యగలవు-"

ఆమె ఇంకేమీ వినేందుకు ఆగలేదు. చప్పున మేడమెట్లు దిగనారంభించింది. యీ సంఘటనతో అతిగా చలించిపోయి, జీన్ కుర్చీలో కూలబడిపొయ్యాడు.

చాలాసేపు అతను ఆ స్థితిలోనే ఉండిపొయ్యాడు. కింది నుంచి కోపంతో కూడిన మాటలు వినిపించినయ్. ఆ కంఠస్వరం విన్నాక, అతను కిందికి వెళ్ళేందుకే నిశ్చయించుకున్నాడు.

ఆమె ఇక అక్కణ్నుంచి వెళ్ళిపొయ్యేందుకు లేచి నిలబడ్డది. జోసఫ్ ఆమె చేతిని పట్టుకొని అంటున్నాడు : "ఒకటి మాత్రం గుర్తుంచుకో. యీ పనివల్ల నువ్వు - నా కుమార్తెలు - నీ కుమార్తెలు - మన సంతానపు భావి జీవితాలను నాశనం చేస్తున్నావ్."

ఆమె నిశ్చిత కంఠస్వరంతో జవాబు చెప్పింది : "ఏమైనా సరే - నేను మాత్రం నీ దగ్గరకు తిరిగి రాను - రాలేను!"

జీన్‌కు అంతా అర్థమైంది. ఏమీ తోచక చప్పున వాళ్ళ దగ్గరికి వెళ్ళాడు.

"ఏమిటీ?...ఆమె వొచ్చేందుకు నిరాకరిస్తోందా?" అన్నాడు.

ఆమె జీన్ వైపు తిరిగింది. పెళ్ళాడిన భర్తముందు కనపర్చాల్సిన సిగ్గునుకూడా మరిచిపోయి బజారులో తీర్పు చెప్పేందుకు వొచ్చిన పెద్దమనిషికి చెప్పినట్టుగా - "ఆయన ఏమంటున్నారో తెలుసా? తిరిగి వొచ్చి తనతో ఒకే ఇంట్లో ఉండమంటున్నారు!"

దాదాపు మోకరించి జాలిగొలిపేట్టుగా ప్రార్థిస్తూన్న ఆ భర్తవైపు ఆమె ద్వేషంతో కూడిన చూపులను చూసింది.

జీన్ ఇక లాభంలేదని తెగించినవాడివలె - తనే మాట్లాడటం మొదలుపెట్టాడు. భర్త చెప్పేమాటల్లోని సత్యాన్నీ, ఏ పాపమూ ఎరుగని ఆ కుమార్తెల జీవితపు సౌఖ్యాల్నీ, చివరకు సాంఘికంగా సంపాయించాల్సిన గౌరవ మర్యాదల్నీ గూర్చి మాట్లాడాడు. కొత్తరకం కారణాల్ని ఆలోచించేందుగ్గాను జీన్ ఆగగానే - జోసఫ్ కరుణార్ద్రమైన కంఠస్వరంతో ఆమెను బతిమాలుతూ మాట్లాడసాగాడు.

"ఇటుచూడు...నీ కూతుళ్ళ జీవితాల్ని గూర్చి ఆలోచించు-"

ఆమె వారిద్దరివైపూ అసహ్యంతో కూడిన చూపు చూసింది. మరొక్క క్షణంకూడా అక్కడ ఆగకుండా చప్పున మేడమెట్లు ఎక్కుతూ, తన ద్వేషాన్ని వెలిగ్రక్కేట్టుగా అంది: "మీరిద్దరూ కూడా వొట్టి నీచులు!"

ఆ దెబ్బ ఇద్దరికీ తగలటంవల్ల, తెల్లమొగాలు వేసి ఒకర్నొకరు చూసుకున్నారు. జోసఫ్ తను కూర్చున్నచోటున కిందపడివున్న టోపీని ఏరుకొని, మోకాళ్ళకు పట్టిన మట్టిని దులుపుకొని, మెల్లిగా తలుపువైపు నడవసాగాడు.

తనను సాగనంపేందుకు వొచ్చిన జీన్‌కు ఆఖరుసారి, నమ్రతతో తలవొంచి, "మనం దురదృష్టవంతులం!" అని బరువుగా నడుస్తూ వెళ్ళిపొయ్యాడు.